# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము !

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రిసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవుసరం !!

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P 533 001.

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి **11** ఫిబ్రవరి **1991** సంచిక **7**


## సంపాదకీయము

### నీవు పరలోకమునకు వెళ్లుదువా ?

### ( Will you go to Heaven ? )

అనేకులు ఈ లోక సంబంధమైన వ్యవహారాలలో చిక్కుకొని తమ జీవితమంతా గడిపేస్తారు. అయితే మనం నిత్యత్వాన్ని గూర్చి ఆలోచించాలి. ఏలయనగా ఈ లోకం లయమైపోయిన తరువాతకూడ మానవుని ఆత్మ నిత్యము జీవిస్తూ యుంటాది. ఈ లోకంలో జీవిస్తూ యుండగానే మానవుడు నిత్యజీవితాన్ని గూర్చి సిద్ధపడాలి. సొలొమోను ఈలా వ్రాసాడు: "ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే; దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండవలెను, మానవకోటికి ఇదియే విధి. గూఢమైన ప్రతి యంశమును గూర్చి దేవుడు విమర్శ చేయునప్పుడు ఆయన ప్రతి క్రియను, అది మంచిదేగాని, చెడ్డదేగాని తీర్పులోనికి తెచ్చును" (ప్రసంగి 12:13, 14).

మానవుడు దేవునితో నిత్యజీవితాన్ని గడపాలని దేవుని కోరిక. "ఆయన మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు" (1 తిమో 2 : 4). మనలో యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు ఆయన మన యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు (2 పేతురు 3 : 9).

పాపము చేయుటవలన మానవుడు తన నిత్యజీవపు హక్కును కోల్పోయాడు. ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము (రోమా 6 : 23). అయితే దేవుడు మానవుని ఇట్టి నిస్సహాయ స్థితిలో విడిచిపెట్టలేదు. ఏలయనగా దేవుడు లోకమునెంతో ప్రేమించాడు. మరియు తన అద్వితీయ కుమారునియందు విశ్వాసముంచు ప్రతివాడు నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయన ననుగ్రహించాడు (యోహాను 3 : 16). రక్షణ ననుగ్రహించు దేవుని కృప ప్రత్యక్షమయ్యింది (తీతు 2:11). గనుక మనము పాపులమైనను క్షమాపణను పొంది పరలోకంలో నిత్యము గడిపే అవకాశము మనకు లభించినది.

ఈ రక్షణ దేవుని కృప వలనను, యేసుక్రీస్తు యిష్టపూర్వకముగా సిలువపై బలి యగుటవలనను సాధ్యమయ్యింది. మన పాపముల యపరాధాన్నంతటినీ క్రీస్తు చెల్లించాడు. మన క్రియలవలన రక్షణను సంపాదించుకోలేము. అయితే దేవుని చిత్తానికి విశ్వాసముతో కూడిన విధేయత చూపిస్తూ దేవుడిచ్చు రక్షణ వరాన్ని మనం పొందగలం. మన విషయమై తాను చేయదగినదంతా దేవుడు చేసేసాడు. మనం చేయదగినదంతా చేసామా ?

హెబ్రీ 5 : 8లో, "ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమలవలన విధేయతను నేర్చుకొనెను...మరియు తనకు విధేయులైనవారి కందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను" అని

వ్రాయబడి యున్నది. గనుక మనం ఆయనకు విధేయులమయ్యామా లేదా అని పరీక్షించుకోవాలి. అయితే దీనిలో ఏమి ఇమిడి యున్నది?

మనలను రక్షణకు నడిపించే మార్గము సూక్ష్మమైనది. "మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు" (ఎఫెసీ 2 : 8, 9). మనం రక్షింపబడాలంటే ఇద్దరు అవుసరం : దేవుడు (కృప), మానవుడు (విశ్వాసం-విధేయత). దేవుడు తన కృపను కనుబరచాడు, మానవుడు విశ్వాసంతో విధేయత చూపాలి. అయితే యేమి చేయాలి ?

మనం క్రీస్తునందు విశ్వసించాలని దేవుడు కోరుచున్నాడు. "ఏలయనగా విశ్వాసము లేకుండా ఆయన కిష్టుడై యుండుట అసాధ్యము" (హెబ్రీ 11:6). "నేను ఆయనననని మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని" యేసుప్రభువు చెప్పారు (యోహాను 8 : 24). సంపూర్ణ విధేయత చూపించడానికి మన విశ్వాసం పునాదివలె యుంటాది.

మరియు మన గత పాపముల విషయమై మారుమనస్సు పొందాలని కూడ దేవుడు కోరుచున్నాడు. మారుమనస్సంటే మనం పాపమునుండి వైదొలగి దేవునివైపు తిరుగుట అన్నమాట. మీరు మారుమనస్సు పొందని యెడల నశించిపోతారని యేసుప్రభువు చెప్పారు (లూకా 13 : 3-5). లూకా 15వ అధ్యాయములో తప్పిపోయిన కుమారుడు తాను జీవిస్తున్న విధానం తప్పు అని, తన తండ్రికి వ్యతిరేకముగా పాపము చేసానని గ్రహించాడు. గనుక అతడు తన తండ్రియొద్దకు తిరిగి వచ్చాడు. క్షమాపణను కోరాడు. దేవునినుండి క్షమాపణ పొందాలంటే మనంకూడ అల్లే చేయాలి. పాపంచేసే అల

వాటును కేవలం విసర్జించాలి. పాప వ్యాపారమునుండి తొలగి పోవాలి.

అంతేకాదు, మన విశ్వాసాన్ని మనుష్యుల యెదుట ఒప్పుకోవాలని దేవుడు కోరుచున్నాడు. యేసుప్రభువు యిట్లు బోధించాడు: "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యులయెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును" (మత్తయి 10: 32, 33). ఈ ఒప్పుకోలు మన పెదవులనుండి మాత్రమే గాక హృదయపూర్వకంగా ఒప్పుకోవాలి. యేసు దేవుని కుమారుడని నోటి మాటతో నేగాక మన జీవిత విధానాన్నిబట్టి కూడా ఒప్పుకోవాలి.

మన పాపములు కడుగవేయబడు నిమిత్తం బాప్తిస్మము పొందాలనికూడ దేవుడు కోరుచున్నాడు (అపొ. కా. 22 : 16). బాప్తిస్మము పొందుట, అంటే నీటిలో ముంచబడుట యనునది మన విధేయతలో ప్రాముఖ్యమైనది. పెంతెకొస్తు పండుగనాడు యెరూషలేము ప్రజలు తమ పాపములు క్షమించబడుటకై యేమి చేయాలో చెప్పబడినది: "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపొ. కా. 2 : 38). మనం క్రీస్తులో యుంటే అన్ని ఆత్మీయాశీర్వాదములు పొందగలము (ఎఫెసీ 1 : 3). బాప్తిస్మము పొందుట ద్వారానే మనం క్రీస్తులో యుండగలము (గలతీ 3 : 27). దేవుని కుటుంబములో ప్రవేశింపజేసేది బాప్తిస్మము. దేవుని ప్రాథమిక ఆజ్ఞలకు విధేయతను అది సంపూర్తి చేయును. బాప్తిస్మము పొందినవారిని ప్రభువు తన సంఘములో చేర్చుకొనును.

అయితే పరలోకానికి వెళ్ళుటకు మనం క్రైస్తవుల మగుటయే కాదు. ఇంకా ఎక్కువ చేయాలి. క్రైస్తవ జీవితాన్ని నమ్మకముగా జీవించాలి. క్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధి పొందాలి (2 పేతురు 3 : 18). కుమారుడు తన తండ్రి లక్షణములన్నిటినీ కలిగియుంటాడు. అట్లే పరలోకం వెళ్ళాలంటే మనం పరలోకమందున్న తండ్రి లక్షణాలను కలిగియుండాలి (2 పేతురు 1:5-11). మనం మరణపర్యంతము నమ్మకముగా యుంటే పరలోకం మనదవునని నిర్ధారణ ఇవ్వబడింది (ప్రక 2:10). మనం నమ్మకంగా లేకపోతే పరలోకానికి వెళ్ళలేము సరిగదా దేవుని ఉగ్రతకు, ప్రతి దండనకు పాత్రులమవుదుము (2 థెస్స 1:7-9).

నీవు పరలోకమునకు వెళ్ళుదువా? ఈ ప్రశ్నకు జవాబును కనుగొనడం మనకు సాధ్యమే. మనం ఆయనతో నిత్యము ఉండు లాగున దేవుడు చేయవలసినదంతా చేసాడు. మరి నీవు చేయవలసినదంతా నీవు చేసావా? నీవు పరలోకం చేరుకోకపోతే నిన్ను నీవే నిందించుకోవాలి గాని మరెవరిని కాదు.

---

## క్రీస్తు సంఘమును గూర్చిన కొన్ని బైబిలు సత్యాలు

## (Some Bible Facts about the Church of Christ)

### క్రీస్తు సంఘము యొక్క ప్రారంభము :

క్రీస్తుద్వారా వాగ్దానము చేయబడెను. మత్త 16 : 18. యెరూషలేములో పెంతెకోస్తు దినమున క్రీ॥ శ॥ 33 లో స్థాపించబడెను. యెషయా 2 : 1-3, లూకా 24 : 49 మరియు అ॥ కార్య 2వ అధ్యాయము. ఆయన దానిని కొనెను. అ. కా. 20 : 28, ఎఫెస్సీ 5 : 23-26.

దాని పునాది :

బండమీద, సత్యముపై లేక "నీవు సజీవమైన దేవుని కుమారుడవైన క్రీస్తు" అను పునాదిపై కట్టబడెను. మత్త 16:18, 1 కొరింథీ 3:11, ఎఫెసీ 2 : 20.

సంఘములో నున్నవారు :

సువార్తకు విధేయులై బాప్తిస్మము పొందిన విశ్వాసులు మత్త 28:18-20, యోహా 3:3-5, అ. కా. 2:38, 41, 47.

ఒకే సంఘము :

సంఘము క్రీస్తు శరీరము. ఎఫెసీ 1:22-23, కొలస్స 1:18,24. ఒకే శరీరము (సంఘము) లోనికి బాప్తిస్మము పొందిన వారు 1 కొరింథీ 12:12, 13, 20 మరియు 27.

ఒకే ఒక సంఘము. ఎఫెసీ 2 : 16; 4 : 4.

సంఘము క్రీస్తు యొక్క వధువు ఆయనకు ఒకే ఒక వధువు కలదు. ఎఫెసీ 5 : 22-32

మతశాఖల విభజనలు పాప సంబంధమైనవి.
1 కొరింథీ 1:10-13, యోహా 17:17-23

సంఘము పిలువబడెను :

క్రీస్తు సంఘము. రోమా 16 : 16
జ్యేష్ఠుల సంఘము. హెబ్రీ 12 : 23
ప్రభువు సంఘము. అ. కా. 20:27-28
దేవుని సంఘము. 1 కొరింథీ 1 : 2
క్రీస్తు స్థాపించెను, కొనెను, ప్రేమించెను.
క్రీస్తు రక్షించెను కావున అది ఆయన సంఘము.

## రక్షణ మరియు సంఘ చిహ్నములు :

క్రీస్తు సువార్త సర్వలోకము కొరకు. మత్త 28:18-20
క్రీస్తు సువార్త సంపూర్ణమైనది. యోహా 14 : 26 16 : 13
రోమా 1 : 16 II తిమో 3 : 16-17

సువార్త మార్పు చేయకూడదు. గలతి 1:6-10, II యోహా 9,11, ప్రక 22 : 18-19

సువార్త వినవలెను. రోమా 10:13-19, మార్కు 16:15, 16
సువార్తను విశ్వసించవలెను. హెబ్రీ 11:6, అ.కా. 2:41
మారుమనస్సు పొందవలెను. లూకా 24 : 47, అ. కా 2 : 38, 17 : 30

క్రీస్తును ఒప్పుకొనవలెను, లూకా 12 : 8, రోమా 10 : 9-10 అ. కా. 8:35-37

బాప్తిస్మము పొందవలెను. మత్త 28 : 18-20; గలతి 3 : 27 రోమా 6:3-22; అ. కా. 2:38, 41, 47.

## బాప్తిస్మము :

సమాధి. రోమా 6:3-4 కొలస్స 2 : 12
పునరుత్థానము. రోమా 6 : 5
ఆత్మమూలముగా జన్మించుట. వాక్యమూలముగ,
ఆత్మ (సువార్త) మూలముగ జన్మించవలెను.
I పేతు 1:23, యాకోబు 1:18, I కొరింధి 4 : 15
నీటిమూలమైన జన్మ. యోహా 3:5, మార్కు 16:15-16

క్రైస్తవ జీవితము యొక్క ప్రారంభము. రోమా 6 : 4,11 II కొరింథ 5 : 17

## బాప్తిస్మము వలన లభించునదేమి ?

క్రీస్తునకు విధేయత. మత్త 28:18-19 అ. కా. 10:48
రక్షింపబడుట కొరకు బాప్తిస్మము. మార్కు 16:16, 1 పేతు 3:21
పాపములను కడిగివేయును. అ. కా. 22 : 16
పాపక్షమాపణ నిమిత్తము. అ. కా. 2:38
క్రీస్తును ధరించుకొనుటకు. గలతి 3:27
క్రీస్తులోనికి. గలతి 3:27
ఆత్మసంబంధమైన ఆశీర్వాదము లన్నియు క్రీస్తునందు కలవు ఎఫెసీ 1 : 3, ఎఫెసీ 1, 2 అధ్యాయములు ఈ సత్యమునే ఖచ్చితముగ బోధించుచున్నవి.

## సంఘారాధన

ఆత్మతోను, సత్యముతోను. యోహాను 4 : 23-24
మనస్సుతోను. కొలస్స 3 : 16
ఆదివారమున కూడుకొనవలెను. అ. కా. 20 : 7, హెబ్రీ 10:25
పాటలు పాడుట. ఎఫెసీ 5:19, కొలస్స 3:16, హెబ్రీ 2:12
ప్రార్థన. అ. కా. 2:41, 1 తిమో 2:1-3
వాక్యోపదేశము. మత్త 28:20, 1 థెస్స 5:11-15
జ్ఞాపకము చేసికొనుట ప్రభురాత్రి భోజనముద్వారా. అ. కా. 20:7, 1 కొరింథీ 11:23-36

సహవాసము. అ. కా. 20:35, II కొరింథీ 9:6-14, కొలస్స 3:17.

## పాపము చేసిన క్రైస్తవులకు క్షమాపణ చట్టము

మారుమనస్సు, ప్రార్థన. అ. కా. 8:22
పాపములను ఒప్పుకొనుట. 1 యోహా 1:9, యాకో 5:16-20.

సంఘము యొక్క పని

సువార్త ప్రకటన : లూకా 24 : 46, 47; I థెస్స 1 : 8; II తిమోతి 4:1-2.

పరిశుద్ధుల ఎదుగుదల. 1 థెస్స 5 : 11-16; ఎఫెస్సీ 4 : 11-16

రోగులను దర్శించుట. మత్త 25:34-40

అవసరంలో ఉన్న వారికి పరిచర్య చేయుట

అ. కా. 6 : 1-5, యాకో 1 : 27

దేవుని మహిమార్థమై. ఎఫెస్సీ 3 : 20, 21

— జార్జి డీహాఫ్

---

## క్రీస్తు యోధులు
## ( Soldiers of Christ )

క్రొత్త నిబంధన సంఘము దేవుని సైన్యముగా వర్ణించబడినది. నిజానికి క్రీస్తుసంఘము యుద్ధమాడుచున్న ఒక గొప్ప సైన్యముగా మనకు కనబడతాది. ప్రతి క్రైస్తవుడు ఈ ఆత్మీయ సైన్యములో ఒక యోధుడని వర్ణించబడింది. పౌలు తిమోతికి ఇట్లు వ్రాసాడు : "విశ్వాససంబంధమైన మంచి పోరాటము పోరాడుము, నిత్యజీవము చేపట్టుము" (1 తిమో 6:12). ఈ మంచి పోరాటము పోరాడాలని అతడు తిమోతిని హెచ్చరించాడు (1 తిమో 1:18). పౌలు తన చివరి ఘడియలలో తన జీవితాన్ని ఇట్లు సంగ్రహించి చెప్పాడు: "మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇక మీదట నాకొరకు నీతికిరీట ముంచబడియున్నది" (2 తిమో 4 : 7-8). యేసుప్రభువు ఈ భూమిమీద అనుగ్రహించి వెళ్ళిన విశ్వాసము ప్రశస్తమైనది. క్రైస్తవులు ఆ విశ్వాసము నిమిత్తమై పోరాడాలని చెప్పబడినది (యూదా : 3).

## శారీరక యుద్ధము కాదు

మనం చేసే యుద్ధము శారీరకమైనది కాదని బైబిలు విపులముగా చెప్పుచున్నది. మరియు మన యుద్ధోపకరణములు శరీర సంబంధమైనవి కూడ కాదు (2 కొరింథీ 10:3-4). అందుచేత "దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి. ఏలయనగా మీ నడుమునకు సత్యమను దట్టి కట్టుకొని, నీతియను మైమరవు తొడుగుకొని, పాదములకు సమాధాన సువార్తవలననైన సిద్ధమనస్సను జోడు తొడుగుకొని నిలువబడుడి. ఇవన్నియు గాక విశ్వాసమను డాలు పట్టుకొనుడి; దానితో మీరు దుష్టుని అగ్ని బాణము లన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు. మరియు రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను ఆత్మఖడ్గమును ధరించుకొనుడి" (ఎఫెసీ 6:14-17).

మన యుద్ధం శరీరసంబంధమైనది కానందున అది యుద్ధము కాకమానదు. సరిగదా మన పోరాటము ప్రమాదకరమైనదని గొప్ప బలము, విశ్వాసము ప్రయత్నము దీనిలో అవుసరమై యున్నవని క్రొత్తనిబంధన బోధించుచున్నది. ఈ యుద్ధము ఎంత యధార్థమో, ఎంత ప్రమాదకరమో పౌలు ఇట్లు వర్ణించాడు: "మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాథులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహముతోను పోరాడుచున్నాము" (ఎఫెసీ 6:12).

## శత్రువు—అపవాది

సంఘముయొక్క పరమ శత్రువు ఎవడో బైబిలువందు చెప్పబడియున్నది. "నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా యుండుడి. మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు...గనుక విశ్వాసమందు స్థిరులై వానిని ఎదిరించుడి" (1 పేతురు 5: 8, 9). ఈ గొప్ప శత్రువు బలవంతుడు,

తంత్రిగాడు (ఎఫెసీ 6:11). అతని సెంబసించు గొప్ప సైన్యము అత నికి కలదని మనమెరుగుదుము (1 యోహాను 5 : 19). మరియు అతడు వారి మనో నేత్రములను గుడ్డితనము కలుగజేస్తాను (2 కొరింథీ 4:4). గనుక వారిలో అనేకులు ప్రభువు పక్షమున లేకయే ఆయన పక్షమున ఉన్నామనుకొంటారు.

## నీ వెవరి పక్షము ?

ఈ యుద్ధము తీవ్రమైనది. మనము ధైర్యముగను, పటిష్టము గను యుండాలి. నీవు ప్రభువు సైన్యములో యున్నావా? నీవు ఆయన పక్షమునైనా యున్నావు, లేవా ఆయనకు వ్యతిరేకముగా యున్నావు. నీవాయన కొరకు యుద్ధమాడుట లేనియెడల, అపవాదికొరకు పోరాడు చున్న వాడవగుదువు. యేసు ఇట్లన్నాడు: నా పక్షమున నుండనివాడు నాకు విరోధి; నాతో కలసి సమకూర్చనివాడు చెదరగొట్టువాడు" (మత్తయి 12:30).

నీవు ఒకప్పుడు ప్రభువు సైన్యములో యుండి పారిపోయిన వాడవా? అట్లయితే నీ ప్రభువును విసర్జించినందున నీకు గొప్ప అవ మానము. అంతేగాదు ఆయనయొక్క తీక్షణమైన ప్రతిదండనను గూర్చిన భయము నీకు కల్గును (హెబ్రీ 10 : 26-31; 2 పేతురు 2:20-22). నీవాయన దండులోనికి తిరిగి వచ్చినయెడల ప్రభువు నిన్ను క్షమించి చేర్చుకొనును. నీవు మారుమనస్సునొంది ఆయన యొద్దకు తిరిగి రమ్ము (1 యోహాను 1:7-9; ప్రకటన 2:4-7; 3:20-22).

క్రీస్తు యోధులారా ధైర్యము కలిగి యుండుడి! "మీ దేవు డైన యెహోవా మీకిచ్చిన మాటచొప్పున తానే మీకొరకు యుద్ధము చేయువాడు" (యెహోషువ 23:10).

—H.D. సిమన్స్.

# ఆశ్చర్యకరుడు
## ( Wonderful )

"నా అంతరింద్రియములను నీవే కలుగజేసితివి. నా తల్లి గర్భమందు నన్ను నిర్మించిన వాడవు నీవే. నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి" కీర్త 139 : 13-14. దావీదు దేవుని శక్తిని తన జీవితంలో ఎరిగిన వాడైనందున సృష్టికర్తయైన దేవుని ఆశ్చర్య కార్యములను తన వ్రాతలలో చక్కగా వివరించెను. దావీదు దేవుని యెడల భయభక్తులు కలిగిన వాడు. తల్లి గర్భములో మానవులకు రూపాన్ని, రంగును, ఇతర లక్షణాలను అనుగ్రహించి యున్నాడు. దేవుని సృష్టిలో ఎన్నో ఆశ్చర్య విషయాలు మనం కనుగొనుచున్నాము.

యిర్మీయాతో దేవుడీలాగు సెల విచ్చెను. "గర్భములో నేను నిన్ను రూపింపక మునుపే నిన్నెరిగితిని, నీవు గర్భము నుండి బయలు పడక మునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని. జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితివి" యిర్మీయా 1 : 4-5. మానవులు తల్లి గర్భములో నున్నప్పుడే వారిని దేవుడెరిగేయున్నాడు. గర్భములో నున్న శిశువు ప్రాణము కలిగియున్నది. అది చలిస్తుంది. మరో ఆశ్చర్యమైన విషయ మేమంటే చేతి బొటన వ్రేలిని నోటితో చప్పరిస్తుంది. "ఎలీసబెతు మరియ యొక్క వందన వచనము వినగానే ఆమె గర్భములో శిశువు గంతులు వేసెను" లూకా 1 : 41. యేసుక్రీస్తు తల్లి గర్భములో నుండవలసిన కాలము సామాన్య మానవుల మాదిరిగానే గాని అద్భుత కార్యమేదీ జరుగలేదు. "వారక్కడ ఉన్నప్పుడు ఆమె ప్రసవ దినములు నిండెను" లూకా 2 : 6.

తల్లి గర్భమందు మానవుని ఎదుగుదల విషయం ఆలోచించిన దావీదు తన భయాన్ని, ఆశ్చర్యాన్ని ప్రకటించెను. దేవుని ఆశ్చర్య

కార్యాలు మన యెదుట కనబడుచున్నప్పటికీ మనం ఆయన యెడల భయభక్తులను కలిగి లేకుండ సంచరించి గర్వాంధుల మగుచున్నాము.

"నాకు మీరు భయపడరా ! నా సన్నిధిని వణకరా !" అని దేవుడు మనలను ప్రశ్నించుచున్నాడు (యిర్మి 5 : 22). "యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము" సామె 1:7.

ఆశ్చర్యకరంగా మానవునికి దేవుడు జీవమును ఊపిరిని అనుగ్రహించి చలింపజేసి, జీవింపజేసి ఆయన యందు మనకు ఉనికిని ప్రసాదించెను.

ఆయన మానవుల విషయంలో మాత్రమే కాదు. జంతువుల విషయంలో కూడ ఆశ్చర్య కార్యములను జరిగించెను. పశువులు ప్రసవానంతరము మావిని (Placenta) తినే సహజగుణాన్ని కలిగి యున్నవి. మన పాడి పశువులు దీనిని తినకుండ మనం జాగ్రత్త పడుదుము. లేకుంటే పాడిపశువు పాలు గణనీయంగా తగ్గిపోతాయి. మన సంరక్షణలో లేని వన్యమృగాల సంగతి ఏమిటి ! అవి వెంటనే మావిని తింటాయి. అందుచేత పిల్లలు విపరీతంగా పాలు తాగి చనిపోకుండ ఈ విధముగ పాలను అదుపుచేసిన క్రమాన్ని సృష్టిలో దేవుడుంచెను. అప్పుడు దేవుని కార్యాలు ఆశ్చర్య కార్యాలు కాదా !

క్రీస్తు తన ప్రసంగంలో ఆదరణను కలిగించే అనేక సూక్తులను బోధించెను, "ఆకాశ పక్షులను చూడుడి; అవి విత్తవు కోయవు, కొట్లలో కూర్చు కొనవు; అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు" మత్త 6 : 26. "మీ పరలోకపు తండ్రి" అని క్రీస్తు బోధించుటలో నిగూఢమైన అర్థం ఉన్నది. నీతండ్రి నిన్ను పోషించడా ! అని క్రీస్తు ప్రశ్నించుచున్నాడు.

నీ తండ్రికి నీవు భయపడవా ! నీ తండ్రికి నీవు ప్రీతి పాత్రమైన వారసుడవు కావాలంటే ఆయనకు విధేయత చూపవలసి యున్నది.

ఈ గాడే ఆశ్చర్యకరుడైన దేవునికి విధేయులవు కమ్ము. ఆయన నీకు ఆశ్రియ దుర్గ మగును.

— E. K. V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

## విత్తువానిని గూర్చిన ఉపమానము

పాఠ్య భాగము-మత్తయి 13:1-23.

బహుజన సమూహములు తనయొద్దకు కూడివచ్చి యున్నందున ఆయన దోనెయెక్కి కూర్చుండెను. ఆయన వారిని చూచి అనేక సంగతులు ఉపమానరీతిగా చెప్పెను. మత్తయి 13:1-3.

యేసు అత్యుత్తమమైన ఉపాధ్యాయుడు. ఆయన పరలోక సత్యములను చిన్న చిన్న ఉపమానముల రూపములో ప్రజలకు బోధించెను. కావున ఆయన ఉపదేశములు శాశ్వతముగా మనుష్యుల హృదయములలో నిలిచిపోయెను. ఉపమానములు అనగా ఒక సత్యమును బోధించుటకు వాడెడి చిన్న ఉదాహరణలు. వేర్వేరు సువార్తలయందు సుమారు ముప్పది ఉపమానములు క్రీస్తు ఉపదేశములుగా మనకు కనిపించుచున్నవి. మత్తయి 13వ అధ్యాయములో "దేవుని రాజ్యమునుగూర్చిన ఉపమానములు వివరింపబడియున్నవి. దేవుని రాజ్యమర్మములు యిందు కనిపించుచున్నవి. అలాగుననే తప్పిపోయిన కుమారునిగూర్చిన ఉపమానము మన తండ్రియైన దేవుని ప్రేమ, క్షమాపణ స్వభావములను గూర్చి వివరించుచున్నది. మత్తయి 13:10-13లో వ్రాయబడిన ప్రకారము, ఉపమానముల ద్వారా ఉపదేశించుటలో, పరలోక రాజ్య మర్మములను యెరుగుట మీకు అనుగ్రహింపబడి యున్నదని శిష్యులతో చెప్పెను. కలిగినవానికే అనేకముగ యివ్వబడును కొంచెముగ నున్నవానికి కలిగినదియు తీసి వేయబడును. వారికి కన్నులుండియు చూడరు, చెవులుండియు వినరు, వారి హృదయములు మందముగా నున్నవని యేసు చెప్పెను. అందుచే

ఆయన ఉపమాన రీతిలో వారికి బోధించెను. యీ భాగమునకును యెషయా 6:9, 10 లోని భాగమునకును సంబంధము కలదు. సువార్త వినుచుండియు హృదయములను కఠినపరచుకొనువారు కలరు. ఆయన సులభముగా గ్రహింపగల సత్యములను వారికి విశదపరచెను గాని వారి హృదయములు కఠినపర్చుకొని యుండిరి. 10 నుండి 17 వచనములు చదువుడి. ఈ ప్రజలు కన్నులారా చూచి, చెవులారా విని, హృదయముతో గ్రహించి, మనస్సు త్రిప్పుకొని నావలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది. వారి చెవులు వినుటకు మందములైనవి. వారు తమ కన్నులు మూసికొనియున్నారు గనుక మీరు వినుటమట్టుకు విందురు గాని, గ్రహింపనే గ్రహింపరు. చూచుటకు మట్టుకు చూతురు గాని యెంతమాత్రమును తెలిసికొనరు అని యెషయా చెప్పియున్నాడు. మత్తయి 13:15. ఈ ప్రవచనము తిరుగుబాటు చేయుచున్న యిశ్రాయేలీయులను గూర్చి చెప్పబడి యున్నది. దేవునియొక్క రక్షణ సంకల్పమును వారు తృణీకరించుచున్నారు. చూచువాటిని చూడగోరియు చూపకపోయిరి. వినువాటిని వినగోరియు వినకపోయిరి. "ఎవడైనను దేవుని రాజ్యమును గూర్చిన వాక్యము వినియు గ్రహింపక ఉండగా, దుష్టుడు వచ్చి వాని హృదయములో విత్తబడిన దానిని యెత్తుకొని పోవును". మత్తయి 13:19. విత్తువాని ఉపమానములో రెండు ప్రాముఖ్యమైన విషయములు కనబడుచున్నవి.

**విత్తువాడు :** కొంతమంది అభిప్రాయము - విత్తువాని ఉపమానము వేర్వేరు నేలలను గూర్చిన ఉపమానము అంటే బాగుండునని అంటారు. ప్రభువు విత్తువాని ఉపమానము అన్నారు. 13:18. విత్తువారు అనగా దేవుని రాజ్య మర్మములను ప్రజలకు ప్రకటించువారు. వారి పని యేమనగా :

a) దేవుని వాక్యము అను విత్తనమును చల్లుట, అది ఫలించునో లేదో అనే బాధ్యత వారికి లేదు.

b) చాలా విత్తనములు మొలకెత్తవు. అది సహజమైన విషయమే: కొన్ని మాత్రము మొలచి ఫలించును.

c) పంటయొక్క ఫలితము విత్తనముపై ఆధారపడి యున్నది. గాని విత్తువానిపై ఆధారపడి లేదు. వారి సేవ ఫలింపదు అను అనుమానమువల్ల చాలామంది సువార్త ప్రకటించరు. ఇది తప్పు భావము.

మనము మంచి విత్తనములను విత్తవలసియున్నది. విడువక సువార్త ప్రకటించవలసి యున్నాము. బాధ్యతతో వాక్యమును ప్రకటించుట అత్యవసరము. వివిధములైన నేలలు మానవ హృదయములకు గుర్తుగా ఉన్నవి. చెవులు గలవాడు వినునుగాక 13:9. ఇందు నిమిత్తము నేను ఉపమాన రీతిగ బోధించుచున్నానని యేసు చెప్పెను. 13:13. మీ కన్నులు చూచుచున్నవి గనుక ధన్యములైనవి. మీ చెవులు వినుచున్నవి గనుక ధన్యములైనవి. 13 : 16, 17. అనేక ప్రవక్తలు, నీతిమంతులును మీరు చూచు వాటిని చూడగోరియు, చూడకపోయిరి. వాక్యము హృదయములో ఫలింపవలెనంటే వినువాడు పూర్తిగ గ్రహింపవలెను. అది విత్తువాని బాధ్యతకాదు

వివిధముగా వేలలు :

1) ప్రభువు చెప్పిన ఉపమానములో, మొదటిగా కఠినమైన రాళ్ళతో కూడిన నేల. 13 : 3, 6 : 4, 19 వచనములు చదువుము. రాతి నేలను పడిన విత్తనము ఫలింపదు. వాక్యమును అంగీకరించుదురు గాని, అందు వేరులేనందున ఫలింపదు. కొంతకాలము మట్టుకే నిలుచుదురు. వాక్యము నిమిత్తము శ్రమయైనను, హింసయైనను కలుగగా అభ్యంతరపడుదురు.

నడుచుదారులు ఉండును. మనుష్యులు నడుచుటవలన అది కఠిన మైపోవును. యీ నేలను పోలిన వారు యెవరనగా: "వినియు గ్రహిం పనివారు" వారు గ్రహింప శక్తి లేనివారు కాదుగాని, ఉద్దేశ పూర్వ కముగా వాక్యమును తిరస్కరించువారు 13:18. మారుమనస్సు పొంది మనస్సు మార్చుకొనుటను వ్యతిరేకించు స్వభావము కలవారు, క్రీస్తు సిలువ నెత్తుకొని వెంబడించుటకు నిరాకరింతురు. మత్త 13 వ అధ్యా యములో వినుట అనుమాట 19 పర్యాయములు కనిపించుచున్నది. కొందరు సంవత్సరముల తరబడి వాక్యము వినుచుందురు కాని, విధే యులు కారు, ఫలింపరు. మరికొందరు విందురు కాని "యెల్లపుడు నేర్చు కొనుచున్నాను. సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము పొందలేక పోవుట" II తిమో 3:7. కావున వినుటవలన విశ్వాసము కలుగును వినువారు లోబడవలెను. రోమా 10:16, 17. సిలువను గూర్చిన వార్త నశించుచున్నవారికి వెర్రితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తియై యున్నది. 1 కొరింథీ 1 : 18. రాతినేలపై పలచగా మట్టియుండును. ఆ మన్నుపై విత్తనము పడినపుడు అవి మొలకయె త్తను కాని మొలచిన విత్తనము లోపలికి పోజాలదు. క్రీస్తు సువా ర్తను వినువారు అంగీకరించుట, గ్రహించుట అవసరము. నామకార్ధ ముగా మాట చాలదు-శ్రమకాలమున వారు నిలుపలేరు- హెబ్రీ 3 : 13.

## ముండ్లపొదల నేల:

ముండ్ల పొదలలో పడిన విత్తనము. వారు వినువారేగాని యీలోక విచారములు, ధన మోసము ఆ వాక్యమును అణచివేయును. దేవునికంటే సుఖానుభవమును ప్రేమించువారు. యిట్టివారు కొలస్సీ 3:1-3. క్రీస్తుతో కూడా లేపబడినవారమైతే పరసంబంధమైన వాటిని

వెదుకవలెను. 2 తిమో 4 : 10. యిహలోకమును ప్రేమించువారు దేవుని ప్రేమించలేరు, మన కుటుంబ వ్యవహారములు వినోదములు, కాలక్షేపములు, లోకవిషయములలో నిమగ్నులమగుట విత్తబడిన విత్తనమును అణచివేయును.

**4. మంచినేలను పడిన విత్తనము :** మంచినేల యనగా మంచి హృదయములు. అవి, దూరంతలుగాను అరువదంతలుగాను, ముప్పది యంతలుగను ఫలించును. వాక్యము విని గ్రహించువారు సఫలులై ఫలింతురు. లూకా 8:14, 15. వారు యోగ్యమైన, మంచి మనస్సుతో వాక్యము విని, దాని నవలంబించుదురు. ఓపికతో ఫలించుదురు. క్రీస్తునందు నిలిచియుండుటవల్ల ఫలభరితమైన జీవితమును ఫలించువారు. యోహాను 15:4. అట్టివారు సత్క్రియలయందు ఆసక్తి కలవారు. తీతు 2 : 14. ఈ ఉపమానము పఠించిన తరువాత మనము ప్రశ్నించుకొనవలసిన దేమనగా; నేను యెట్టినేలను పోలియున్నాను? దేవుని వాక్యము వినుటకును నేర్చుకొనుటకును నాకు మనస్సు ఉన్నదా? సత్క్రియలయందు ఆసక్తి నాకు కలదా? హెబ్రీ 10:24. క్రైస్తవ ఆరాధన, సహవాసము, సత్క్రియలు చేయుటలో మనము ఫలింపవలెను తీతు 1 : 16. క్రీస్తు సంఘములో మనము బహుగా ఫలించెడి క్రైస్తవులుగా ఉన్నామా?

—K. జీవానందం, అనకాపల్లి.

---

క్రీస్తు సంఘముల "సత్యవాణి" రేడియో కార్యక్రమములు ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో మధ్యాహ్నం 2-15 గం॥లకు రేడియో శ్రీలంక ద్వారా వినండి! ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి.

Director : Bible Correspondence Course
Post Box 80, KAKINADA-533 001.

# కాకినాడ బిల్డింగు విరాళముల జాబితా

ఈ దిగువ నుదహరించిన సోదర సోదరీలు కాకినాడ బిల్డింగు నిమిత్తము విరాళము నిచ్చిరి. వారందరికీ మా హృదయ పూర్వక వందనములు. ఇప్పుడు పై అంతస్థు పని నెమ్మదిగా సాగుచున్నది. సత్యవాణి ఆఫీసు, బైబిలు కరస్పాండెన్సు కోర్సు, సత్యవాక్య పని అంతా నూతన భవనములో దిగువ అంతస్థునకు మార్చబడినవి. రామారావుపేట క్రీస్తు సంఘ ఆరాధన కార్యక్రమములు కూడ నూతన భవనంలోనే జరుగుచున్నవి. ఇంకా మిగిలియున్న విస్తారమైన పనికొరకు ప్రార్థించ మనవి :

| | |
|---|---|
| బండారు అప్పారావు, ఏటికొప్పాక | 25-00 |
| K. దుర్గారావు, సాలిపూర్, కటక్, ఒరిస్సా | 100-00 |
| K. కమలమ్మ, చంద్రపాలెం | 40-00 |
| N. శాంతారావు, పెదపూడి, తెనాలి తాలూకా | 20-00 |
| వెంకట్‌నగర్ క్రీస్తు సంఘము N. దేవానందంగారి ద్వారా | 25-00 |
| దారా అబ్రహాము, చిలకలూరిపేట | 20-00 |
| M. సౌభాగ్యమ్మ, పేరువంచ, ఖమ్మం జిల్లా | 30-00 |
| దానవాయిపేట క్రీస్తు సంఘము M. సత్యానందంగారి ద్వారా, రాజమండ్రి | 600-00 |
| P. ఆగ్నేస్, కొండపల్లి | 100-00 |
| M. ఐజక్, కోటపాడు | 15-00 |
| A. మోహనరావు, నిడుబ్రోలు | 100-00 |
| K. క్రిష్టాఫర్, అంబికానగర్, కర్నాటక | 20.00 |

| | |
|---|---|
| M. సాలొమోన్‌రాజు, మందామ్రి, వరంగల్ | 25-00 |
| L. సునీత విలియమ్స్, సోమాజిగూడ, హైదరాబాదు | 116-00 |
| K. A. జోసఫ్, కృష్ణసముద్రం, చిత్తూరు జిల్లా | 25-00 |
| D. ప్రభుదాస్, టేకి, కపిలేశ్వరపురం | 60-00 |
| తిరుమాలి క్రీస్తు సంఘము K. రాజబాబుగారి ద్వారా | 100-00 |

—o—

## నీవు ఈమధ్య అన్నము తిన్నావా ?

### ( Have you Eaten Lately ? )

దేవుని వాక్యము తేనె వంటిదని దావీదు అలంకార రీతిగా చెప్పాడు. దేవుడు తన గ్రంథాన్ని యెహెజ్కేలుకు తినిపించగా అతడు దానిని తిన్నాడు. అది అతని నోటికి తేనెవలె మధురముగా యుండెను (యెహెజ్కేలు 3 : 3). నీతికొరకు ఆకలి దప్పులు గలవారిని గూర్చి యేసు ప్రభువు చెప్పారు (మత్త 5:6). అట్టివారు తృప్తిపరచ బడుదురని ఆయన వాగ్దానము చేసారు.

నింపబడడానికి ప్రతివాని యొద్ద ఖాళీ స్థానము కలదు. కొందరు దానిని మాదక పదార్థములతోను, సారాయితోను నింప బూను కొంటారు. ఎన్నటికీ నింపబడని కోరిక వలన వాటిని సేవించు వారు వాటికి బానిసలై పోదురు. సూర్యుని క్రిందనున్న కోరిక లన్ని టిని తీర్చుకొనుటకు అవకాశము కలిగియుండిన జ్ఞానియైన సొలొ మోను, అవన్నియు వ్యర్థమని చెప్పాడు. ఒకడు కష్టపడి పనిచేసి తన చేతిపని యొక్క ప్రతిఫలము అనుభవించుట మేలు. దేవునియందు భయ భక్తులు కలిగి ఆయన కట్టడల ననుసరించి నడచుచుండవలెను. మానవ కోటికి ఇదియే విధి (ప్రసంగి 12 : 13).

విపరీతమైన ఆకలి వలన ఏశావు ఆత్మీయ విలువలకు ప్రాధాన్యత నీయలేదు. ఆకలివలన చనిపోవుచున్నాను గనుక జ్యేష్టత్వము నాకెందుకు అని అతడు ఆలోచించాడు. దానిని అమ్మివేసాడు. (ఆదికాండము 25). అతడట్లు చేసినందున భ్రష్టుడని వ్యభిచారి యని పిలువబడ్డాడు (హెబ్రీ 12:16). శారీరక ఆకలికి, ఆత్మీయ ఆకలికి గల తారతమ్యము ఇక్కడ మనం చూడగలము.

ఆకలి ఒక బలమైన కోరిక. మానవునికి మొదట ఆకలి తీరాలి. కోటి విద్యలు కూటి కొరకే అని అందుకే అన్నారు. పాతనిబంధనలోను క్రొత్త నిబంధనలోను కూడ చెప్పబడిన మొదటి శోధన ఆహారమును గూర్చినట్టిదే. యేసు 40 దినములు ఉపవాస ముండిన పిదప ఆకలి గొనెను. "శోధకుడు ఆయన యొద్దకు వచ్చి - నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను" (మత్త 4:3). "అందు కాయన మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదుగాని దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాట వలనను జీవించును అని వ్రాయబడి యున్నదనెను" (మత్త 4:4). మరింకొక సందర్భములో యేసు శిష్యులు ఆహారము కొనుటకు ఊరిలోనికి వెళ్ళినట్లు చూడగలము (యోహా 4:8). భోజనసమయం దగ్గరయ్యింది. ఆయనకు ఆకలి వేసింది. ఆయన వారికొరకు కనిపెట్టుచుండగా ఒక సమరయ స్త్రీకి ఉపదేశించే అవకాశం లభించినది. వారు తిరిగి వచ్చేసరికి ఆయనకు ఆకలి యేమీ లేదని గ్రహించి ఆశ్చర్యపోయారు. "యేసు వారిని చూచి, నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమై యున్నదని" చెప్పెను (యోహా 4:34).

"మీరు క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము

ఆ పాలను అపేక్షించుడి" యని పేతురు చెప్పుచున్నాడు (1 పేతు 2:3). "ప్రభువు దయాళుడని మీరు రుచిచూచి యున్న యెడల" అని అతడు మొదలుపెట్టాడు. క్రొత్తగా జన్మించిన శిశువు పాలరుచి తెలియగానే పాలకొరకు ఆశతో అపేక్షిస్తాడు. అల్లే ప్రభువు వాక్యము వలన లభించు రుచి, మనలో మరింత ఆకలి జనింపజేసి ప్రభువులో ఎదుగుటకు సహాయం చేస్తాది.

—డేవిడ్ హేలట్, షిల్లాంగ్, మేఘాలయ.

---

## క్రీస్తులో విజయం

1. ఆదిలో వచ్చింది - అబ్రాహాముకు శ్రమ
ఒక్క సుతుండైన - నిక్కముగ నిలబడి
మోరియాకు వెళ్ళెను - మొక్కు తీర్చుటకు
కత్తి పైకెత్తగ కరుణ చూపెను తండ్రి -
ఆకాశచుక్కలవలె ఆశీర్వదించె. (ఆది 22:1-22)

2. బాబెలు దేశములో - బంగారు బొమ్మకు
నమస్కరించ తగదని - నడుముకట్టారు
అగ్ని గుండమునుండి - ఆదిలో దేవుండు
ముగ్గురను కాపాడి - మహిమ చూపాడు (దానియేలు 3 అధ్యా)

3. లాభ సాధనకొరకు - సోదె చెప్పెడివారు
పౌలు సీలను పట్టి - బంధించినారు
చెరలో ఉన్నను - చింతించరాదని
పాటలతో ప్రార్థనతో - పగిలె చెరసాల (అపొ. కా. 16:16-33)

4. ఊజు దేశమునందు - యోబు భక్తుండొకడు
రాజ్యము నేలుచూ - రాజిల్లినాడు
కామరులే చనిపోయె - కష్టాలు ఎదురైన
జగమంత దేవునిదే - దిగులెందు కిపుడనిబల్కె (యోబు 2 అధ్యా)

5. దర్యావేషు పాలనలో - ధరణియందెవ్వరు
ప్రార్థించవలదని - ప్రకటించినాడు
ప్రకటనకు నేరుగా - ప్రార్థించి దానియేలు
సింహాపు చెరనుండి - చిగురించినాడు (దానియేలు 6 అధ్యా)

6. శ్రమలెన్ని వచ్చినా - శత్రువులె పైబడిన
క్రుంగిపోవలదయ్య - క్రీస్తు సోదరుడా
కష్టమును భరియిస్తే - క్రీస్తులో కృపవరము
ఓర్పుతో నడిచిపో - తీర్పులో జయమే (మత్త 5 : 10, 11).

— నేలపూడి కృష్ణమూర్తి, గంటి.

---

## క్రీస్తు సంఘమనగా నేమి?

## ( What is the Church of Christ )

బైబిలును చదువువాడెవడైనను సరే క్రీస్తు పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తు (వారములో మొదటి) దినమందు క్రీస్తు సంఘము యెరూషలేములో స్థాపించబడెనని ఇట్టే తెలిసికొనును (అపొ. కా. 2). నేను నా సంఘమును కట్టుదునని యేసు చెప్పెను (మత్త 16 : 18).

యేసు సంఘమును తన రక్తముతో కొన్నాడు. అంటే దాని మూల్యమును సిలువపై ఆయన చెల్లించాడు (అపొ. కా. 20 : 28; ఎఫె 5 : 23-25). బైబిలులో మనకు కనబడు సంఘము దేవుని కుటుంబము, ఆయన మందిరము (1 తిమో 3 : 15).

## దానిలో ప్రవేశించుట ఎట్లు ?

ఆత్మపూర్ణులైన అపొస్తలుల కాలములో ప్రజలు యేసు దేవుని కుమారుడని, ఆయన తమ పాపముల కొరకై మరణించెనని విశ్వసించి తమ పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తు నందున్న విశ్వాసమును ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుటద్వారా క్రీస్తు సంఘసభ్యులైరి (రోమా 6 : 3; అపొ. కా. 2 : 38). క్రీస్తులో ఆయన రక్తముద్వారా పాపక్షమాపణ కలదు ఎఫెసీ 1 : 7; అపొ. కా. 2 : 36-47; రోమా 6 : 3-4).

అపొస్తలుల కాలములో ఒకని విధేయత పాపములనుండి రక్షించినప్పుడు క్రీస్తు సభ్యునిగా, దేవుని కుటుంబ సభ్యునిగా అతని చేసెడి. బైబిలులో మనకు కనబడు క్రీస్తు సంఘము, దేవుని సంఘము ఒక్కటే. నేడుకూడ మనం క్రీస్తు సువార్తకు విధేయులమైతే రక్షింపబడగలము, సంఘ సభ్యుల మవగలము.

సంఘమును గూర్చి బైబిలునందు వివిధ పదములు వాడబడినవి. మన ప్రభువు సంఘము సూక్ష్మంగా 'సంఘము' అని పలుసార్లు చెప్పబడినది. బైబిలులో సంఘము వర్ణించబడిన పదజాలముతో నేడు దానిని వర్ణించుట సరియే. పరలోకమునకు వెళ్ళగోరు ప్రతివాడు దేవునికిష్టపూర్వకముగా జీవించవలెను. మరియు "ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు శ్రద్ధ కలిగినవారై యుండవలెను" (ఎఫెసీ 4 : 1-6). బైబిలులో మన కగుపడు సంఘము దేవుని కుటుంబము. (అదొక ఆత్మీయ రాజ్యము. దానికి శిరస్సు క్రీస్తే.

### కేంద్ర స్థానము ఎక్కడ

క్రొత్తనిబంధనలో మన కగుపడు సంఘముయొక్క కేంద్ర స్థానము (Head Quarter) పరలోకములో యున్నది. అక్కడ క్రీస్తే సంఘానికి శిరస్సుగా యున్నాడు. ఇహపరములయందు క్రీస్తుతప్ప వేరొకడు సంఘానికి శిరస్సుగా లేడు.

శరీరమునకు లేదా సంఘమునకు శిరస్సైయున్న క్రీస్తు తన నూతన నిబంధన నియమావళి చొప్పున సంఘమును పాలించుచున్నాడు. మన ప్రభువు సంఘములో యుండుట ఎంతో ఆనందదాయకము. ఆయన దానిని తన స్వరక్తమిచ్చి సంపాదించాడు (అపొ. కా. 20 : 28). ★ — బేసిల్ ఓవర్టన్,

## అసలు, నకిలీ

## (The Real and the Counterfeit)

బెరయలోని విశ్వాసులు "థెస్సలోనీకయలో ఉన్నవారికంటె ఘనులై యుండిరి గనుక ఆసక్తితో వాక్యమును అంగీకరించి, పౌలును సీలయును చెప్పిన సంగతులు ఆలాగున ఉన్నవో లేవో అని ప్రతిదినమును లేఖనములు పరిశోధించుచు వచ్చిరి" (అపొ. కా. 17:11).

బజారులో ఏదైనా మంచి వస్తువు ఉన్నదంటే, దానిలాంటి నకిలీ వస్తువులుకూడ చాలా యుంటాయి. అసలైన దానికి నకిలీ వస్తువు ఎంత దగ్గరగా కనబడితే దానిని గుర్తించడం అంత కష్టము. ఒక్కొక్కసారి ప్లాస్టిక్ రబ్బరుతో చేయబడిన దానికి తోలుతో చేయబడిన దానికి తేడా తెలుసుకోవడం అంత తేలిక కాదు. అలాగే వజ్రానికి గ్లాసుకు తేడా తెలియకపోవచ్చు. మెరిసే ప్రతి వస్తువు వజ్రము కాదు. అలాగే మన దేశంలో నకిలీ రూపాయనోట్లు చెలామణీ చేసేవారున్నారు. సామాన్య ప్రజలు ఈ నకిలీ నోట్లవలన మోసపోతారు. అయితే ప్రభుత్వమువారు ఈ మోసగాళ్ళను పట్టుకొంటారు.

క్రొత్త నిబంధనలో యున్న ప్రతి విధమైన హితబోధకు, మానవులు కల్పించిన బోధలు, సిద్ధాంతములు అనేకము లున్నవి. ఇవన్నీ నకిలీ బోధలే. యివి ఎంత నకిలీ సిద్ధాంతములంటే, కొద్దిపాటి బైబిలు జ్ఞానంగలవాడెవడైనను వాటిని సులభంగా గమనించేయగలడు. అయితే ఈ అబద్ధ సిద్ధాంతములు సత్యానికి ఎంత దగ్గరగాయుంటే వాటిని పసిగట్టడం అంత కష్టమవుతాది. అవి చాలమట్టుకు బైబిలు పదాలతో ముస్తాబై యుంటాయి. గనుక వాటిని వినేటప్పుడు సత్యమే అని అనిపిస్తాయి. ఉదాహరణకు బైబిలులో మనకు కనబడు మొదటి అబద్ద బోధను గమనించండి. "నీవు వాటిని తిను దినమున నిశ్చయ

ముగా చచ్చెదవని" దేవుడు ఆజ్ఞాపిస్తే (ఆది 2:17), "మీరు చావనే చావరని" అపవాది బోధించాడు (ఆది 3:4). "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని" యేసు బోధిస్తే (మార్కు 16 : 16), నమ్మి రక్షణ పొందినవాడు బాప్తిస్మము పొందవలెనని నేడు అపవాది బోధించుచున్నాడు. ఈ నకిలీ బోధ సత్యానికి దగ్గరగానే యున్నట్లు కనబడుచున్నను, అది సత్యానికి సుదూరం.

బేంకులలో పనిచేయువారు, ప్రభుత్వాధికార్లు ప్రతి నకిలీ నోటును పరీక్షించి తెలుసుకోవలసిన అవుసరం లేదు. వారు అసలు నోట్లను బాగుగా ఎరిగియున్న వారైతే నకిలీ నోట్లను ఇట్టే పసిగట్టగలరు. మానవ కల్పిత బోధలను, ఆజ్ఞలన్నిటిని మనం తెలిసికోనవసరంలేదు. మనం సత్యవాక్యమునందు అనుభవ జ్ఞానం గలవారమైతే, అసత్య సిద్ధాంతములను బోధలను ఇట్టే పసిగట్టగలము. అందువలననే బెరయలోని క్రైస్తవులు ఘనులని చెప్పబడుటలో ఆశ్చర్యములేదు. వారు ప్రతిదినము లేఖనములను పరిశోధించేవారు. నీవు వినే బోధ అసలో, నకిలో వాక్యమును పరిశోధించకపోతే నీకు తెలియదు.

— జీన్ మిల్లర్.

---


Regd. No.H /KD—45 KD.H.C

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001


No.

To

..............................

..............................

..............................

..............................